## క్లుప్తంగా

### నేటి నుంచి పంచాయతీ పాలకవర్గాలకు శిక్షణ

కాజులూరు: మండలంలోని పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సోమవారం నుంచి రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జె.రాంబాబు ఆదివారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగే ఈ శిక్షణా తరగతుల్లో పంచాయతీ ఉప సర్పంచులు, పాలకవర్గ సభ్యులకు గ్రామాభివృద్ధి, పాలన విధానాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ ఉప సర్పంచులు, పాలకవర్గ సభ్యులు హాజరు కావాలని కోరారు.

### నేడు, రేపు వార్డు సభ్యులకు శిక్షణ

మండపేట: మండలంలోని పంచాయతీ ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు సోమ, మంగళ వారాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి ఆదివారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు శిక్షణ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఈ తరగతులకు మండలంలోని 12 పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**రామచంద్రపురంలో..**

రామచంద్రపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రిఫ్రెషర్ ట్రైనింగ్ నిర్వహించనున్నట్టు ఈఓపీఆర్డీ ఎన్.సెలత్‌రాజు ఆదివారం తెలిపారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లోని ఉప సర్పంచులు, ఒక్కో గ్రామపంచాయితీకి ఇద్దరు వార్డు సభ్యులు చొప్పున శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పంచాయతీలో సాధారణ కనీస పరిపాలన విధానం, ఏపీపీఆర్ చట్టం- 1994లోని నిబంధనలు, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు తదితర 10 అంశాలపై రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు కొనసాగుతాయని ఈఓపీఆర్డీ తెలిపారు.

### కాజులూరు ఎంపీడీఓగా రాంబాబు



ఎంపీడీఓ రాంబాబుకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

కాజులూరు: స్థానిక ఎంపీడీఓగా జె.రాంబాబు నియమితులయ్యారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన ఐ.రత్నరాజు మూడు నెలల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో రామచంద్రపురం నుంచి బదిలీ వచ్చిన సూపరింటెండెంట్ నాగేశ్వరశర్మ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం ఎంపీడీఓగా పనిచేస్తున్న రాంబాబుని కాజులూరు ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు.

### కాల్‌మనీ బాధితులకు పరామర్శ



కాల్‌మనీ బాధితులను పరామర్శిస్తున్న పబ్బినీడి

మండపేట: పట్టణంలోని కాల్‌మనీ వ్యాపారి బాధితులు పలువురికి ఏపీ ఐక్య కాపునాడు అండగా నిలిచింది. ఐక్య కాపునాడు అధ్యక్షుడు పబ్బినీడి వెంకటేశ్వరరావు ఆదివారం మండపేట వచ్చి బాధితులను పరామర్శించారు. వారి సమస్యలు విన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాధితులకు కాపునాడు తరఫున కులాలకు అతీతంగా అండగా నిలబడతామన్నారు. ఈ కాల్‌మనీ వ్యవహారంపై జిల్లా స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో కాపు నాయకుడు కేవీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### సభ్యత్వాల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిబాబు

కె.గంగవరం: బీజేపీ సభ్యత్వాల నమోదుపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆ పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు సూచించారు. మండలంలోని కోటిపల్లి హైండా సత్రంలో ఆదివారం నియోజకవర్గ కో కన్వీనర్ సలాది శేఖర్ అధ్యక్షతన బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా ప్రతి బూత్‌లో 100 సభ్యత్వాలు నమోదు చేయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ మండల అధ్యక్షులు ఏవీ రమణమూర్తి, పార్లమెంట్ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, కొత్తపేట కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబుగౌడ్, నాయకులు ఆకేటి కృష్ణ, కొట్టువాడ హరిబాబు, రాఘవేంద్ర, సలాది వీరబాబు, మండపేట కన్వీనర్ సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సాగుకు తెగుళ్ల బెడద

- అధిక ఉష్ణోగ్రతలతో వరిని ఆశిస్తున్న ఎండాకు తెగులు
- పంట పొలాల్లో వేగంగా వ్యాప్తి
- ఆందోళన చెందుతున్న రైతులు



ఎండాకు తెగులు సోకిన పంట పొలం



ఎండాకు తెగులు సోకిన వరి దుబ్బు

రామచంద్రపురం: రెండు వారాలుగా వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల ప్రభావం ఖరీఫ్ పంటలపై పడింది. పగలు వేసవిని తలపించేలా ఎండ.. రాత్రి వేళల్లో మంచు పడటంతో ఖరీఫ్ పంటలను తెగుళ్లు ఆశిస్తున్నాయి. ఉదయం నుంచి విపరీతమైన ఎండ కాయటంతో పాటుగా వేడి గాలులు వీయటంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వర్షాకాలం ముగిసి శీతాకాలం ప్రారంభమవుతున్న తరుణంతో ఏర్పడిన ఈ మార్పుల కారణంగా రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో వరి పంటకు ఎండాకు తెగులు సోకింది. ఇది దిగుబడిపై ప్రభావంతో చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రెండు నియోజకవర్గాల్లో...**

రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సుమారు 54 వేల ఎకరాల్లో, మండపేట నియోజకవర్గంలోని మండల గ్రామాల్లో సుమారుగా 58 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరి సాగు చేపట్టారు. సాధారణంగా ఖరీఫ్‌లో స్వర్ణరకం వరిని పండిస్తుంటారు. రెండు నియోజకవర్గాల్లోనూ ముందుగా నాట్లు వేసిన పొలాల్లో పంట ప్రస్తుతం ఈనిక దశలో ఉంది. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో దాదాపు 30 శాతం పంట పొలాల్లో ఎండాకు తెగులు సోకినట్లు అధికారులు, రైతులు గుర్తించారు.

**గుర్తించండి ఇలా..**

దుబ్బు చుట్టూ ఉన్న ఆకులు లేత పసుపు రంగులోకి మారి తరువాత ఎండిపోయాయి. ఈనిక దశలో ఉండే దుబ్బులకు ఈనిక రాకుండా పోవటంతో దిగుబడి తగ్గిపోతుంది. తెగులు సోకిన వరి మొక్క ఆకులపై బూడిద రంగు చారలు ఏర్పడి వాటి నుంచి తెల్లగా జిగురు పదార్థం స్రవిస్తుంది. ఒక దుబ్బు నుంచి మరో దుబ్బుకు వేగంగా ఎండాకు తెలుగు వ్యాప్తి చెందుతుంది. వరిచేలల్లో సోకే తెగుళ్లలో ప్రమాదకరమైనది ఈ ఎండాకు తెగులు. చిరు పొట్ట దశలోని గింజలపై ప్రభావం చూపి గింజలను గట్టిపడకుండా ఈ తెగులు చేస్తుంది. రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలంలోని దంగేరు, శివల, యర్రపోతవరం, బాలాంత్రం, కె.గంగవరం, కోటిపల్లి సుందరపల్లి తదితర గ్రామాలు, రామచంద్రపురం మండలంలోని వెంకటాయపాలెం, మామిడిగుంట, నెలపర్తిపాడు, తదితర గ్రామాలు కాజులూరు మండలంలోని కుయ్యేరు, కోలంక, దుగ్గుదూరు తదితర గ్రామాల పొలాల్లోనూ ఈ ఎండాకు తెగులు ఎక్కువగా వ్యాప్తి చెందుతోంది. వరికి వ్యాధి సోకిన వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అధికారులు పొలంబడి కార్యాక్రమాల ద్వారా రైతులకు ఎండాకు తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.

**నత్రజని వాడకం నిలిపివేయాలి**



వాతావరణంలో మార్పుల కారణంగా పంట పొలాల్లో ఎండాకు తెగులు అధికంగా వ్యాపిస్తోంది. దీని నివారణకు ముందుగా వరిలో నత్రజని వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలి. పంట చేలల్లో మురుగునీటిని తొలగించాలి. ప్లాంటామైసిన్, బ్యాక్టీరియామైసిన్ 100 గ్రాములు కలిపి పిచికారీ చేస్తే ఎండాకు తెగులును నివారించవచ్చు. వరిలో తెగుళ్లు, పురుగులను తట్టుకునే శక్తి రావాలంటే ఎకరానికి 20 కేజీల పొటాష్, 5 కేజీల యూరియా వేయాలి. ఎండాకు తెగులు అధికంగా ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించి తగు చర్యలు చేపట్టాలి.

సత్యప్రసాద్, మండల వ్యవసాయాధికారి, రామచంద్రపురం

### చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి



మహిళలకు పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

రామచంద్రపురం: ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆస్తి హక్కు, వరకట్న నిషేధ చట్టం, మహిళలకు ఓటు హక్కు చట్టం, వినియోగదారుల చట్టం, ప్రాంసరీ నోట్లు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ స్కూళ్లలో న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ రిసోర్స్ పర్సన్, అడ్వకేట్లుగా దోమలపాటి సత్యనారాయణ, పీవీఎస్ జానకీలను నియమిస్తున్నట్లు వెల్లడించారు. వీరు గ్రామంలో చట్టాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. అనంతరం మహిళా సభ్యులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ మంగాదేవి, డీఆర్‌డీపీ ఏపీఎం అర్జున్ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆయన ‘మన గ్రామం-మన సుభాష్’ కార్యక్రమం నిర్వహించారు. ద్రాక్షారామ, మేగాయమ్మపేట, తోటపేట, అన్నాయిపేట గ్రామాల్లోని ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నియోజకవర్గంలోని ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో అవినీతిని ప్రక్షాళన చేశామన్నారు. డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కొత్తపల్లి అరుణ, అంబటి తుకారాం, పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ప్రియమిత్ర ప్రతిభా పురస్కారాల ప్రదానం



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: ప్రభుత్వ పాఠశాలల్లోని మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు పట్టణంలోని 1988 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ప్రియమిత్ర సంఘంగా ఏర్పడ్డారు. వారంతా నేడు వివిధ స్థాయిల్లో స్థిరపడి పేదింటి ఉత్తమ విద్యార్థులకు అండగా నిలబడుతున్నారు. స్థానిక గొల్లపుంత వీధిలోని శుభమస్తు ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మెరిట్ విద్యార్థులకు రూ.1.50 లక్షలు ఉపకార వేతనాలుగా అందించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందించారు. ఈ సందర్భంగా ప్రియమిత్ర సంఘం ముఖ్య సభ్యుడు ప్రసాదుల భవానీ వీరకుమార్ మాట్లాడుతూ తామంతా ప్రభుత్వ జూనియర్ కాలేజ్, రథం స్కూళ్లలో చదువుకున్న టెన్త్ క్లాస్ మిత్రులమన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుని ర్యాంకులు సాధించిన 10 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఉపకార వేతనంగా అందించామన్నారు. అలాగే విజయవాడ వరద బాధితులకు ప్రియమిత్ర సంఘం తరఫున రూ.30 వేలు అందించామన్నారు కార్యక్రమంలో సంఘ సభ్యులు దొంగా శ్రీనివాస్, పీసపాటి సుబ్బారావు, అంకం వీరన్న, మలకల రామకృష్ణ, కోరా భాస్కర్ చౌదరి, సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థో సమస్యలపై అవగాహన అవసరం

**చెల్లూరులో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం**



రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్న సర్పంచ్ రాఘవ, డాక్టర్ తేజోఫణీంద్ర తదితరులు

రాయవరం: పౌష్టికాహారం, తగిన వ్యాయామం లేకపోతే ఎముకలు గుల్లబారతాయని, తద్వారా ఎముకలు, వెన్నెముక సమస్యలు ఉత్పన్నమవుతాయని రాజమహేంద్రవరం వేద ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.తేజోఫణీంద్ర అన్నారు. మండలంలోని చెల్లూరులో ఆదివారం ఉచిత ఎముకలు, ఆర్థోస్పైన్ స్పాండలైటిస్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆ గ్రామంలోని రైతు భవనంలో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ తేజోఫణీంద్ర మాట్లాడుతూ ఆకుకూరలు, గుడ్లు, మాంసం, బీన్స్ వంటి ఆహారంగా తీసుకోవడంతో పాటుగా, రోజుకు 45 నిమిషాలు నడవడం ద్వారా ఎముకల్లో సాంద్రత పెరిగిన ఎముకలు గట్టి పడతాయన్నారు. గ్రామ పెద్ద ముత్యాల పెదబాబు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి కనీస వ్యాయామం చేయాలన్నారు. సర్పంచ్ పాలిక రాఘవ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మిషన్ సహాయంతో ఎముకల సాంద్రతను తెలియజేశారు. ముమ్మిడివరపు కోటేశ్వరరావు, ముత్యాల సాయిరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో చెల్లూరు, వెంటూరు, పసలపూడి, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాలకు చెందిన 150 మంది ఉచిత వైద్య సేవలు పొందారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరంలో వేద ఆస్పత్రి సిబ్బంది మార్ని సాయిరామ్, ముత్యాల శబరీష్, మేడిశెట్టి సత్యనారాయణ, మేకా సత్తిబాబు, మణికంఠ, సందీప్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..



రాయవరం వెలంపేట రామాలయం వద్ద మహిళలు నిర్వహిస్తున్న బతుకమ్మ సంబురం

రాయవరం: తెలంగాణలో జరుపుకునే బతుకమ్మ పండుగను రాయవరం వెలంపేట రామాలయం వద్ద మహిళలు ఆదివారం ఆడుతూ..పాడుతూ నిర్వహించారు. పూలతో బతుకమ్మలను ఒక్కచోట చేర్చారు. వాటి చుట్టూరా తిరుగుతూ ఒక్కేసి..పువ్వేసి చందమామ.. బతుకమ్మ... బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడిపాడారు. అనంతరం బతుకమ్మను శిరస్సుపై ధరించిన మహిళలు దుర్గమ్మ తల్లి ఆలయం, పోలమ్మ పుట్ట వద్దకు తీసుకుని వెళ్లారు. అనంతరం బతుకమ్మను సాగనంపారు. బతుకమ్మ పాటలను పాడుతూ ఆడుతూ సాగిన ఈ సంబరాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ గత మూడేళ్లుగా బతుకమ్మ సంబరాన్ని చేస్తున్నట్లు తెలిపారు.

### అమ్మవారికి వెండి చీర, కిరీటం సమర్పణ



ద్రాక్షారామలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి సమర్పించిన వెండి చీర

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ కన్యకాపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారికి గ్రామానికి చెందిన దాత కొమ్మిశెట్టి సుబ్రహ్మణ్య వరప్రసాద్ వంశోద్ధారకులు వెండి చీర సమర్పించారు. అదే గ్రామానికి చెందిన పసుమర్తి కృష్ణ వెండి కిరీటాన్ని సమర్పించారు. వినాయకుడికి తవ్వా నారాయణరావు వెండి కిరీటాన్ని, వీరభద్రుడికి వెచ్చా వీరశంకరం వెండి కిరీటాన్ని సమర్పించారు. వాటిని పండితులు ఆయా దేవతామూర్తుల విగ్రహాలకు అలంకరించారు. ఉత్సవాల నిర్వాహకులు దాతలను అభినందించారు.

# లలితాదేవీ నమోస్తుతే..



కొత్తూరు రోడ్డులో లలితా త్రిపురసుందరీ దేవిగా కనకదుర్గమ్మ అమ్మవారు



వెదురుపాక పీఠంలో లలితా సుందరీ దేవిగా విజయదుర్గా అమ్మవారు



లలితా సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన రాయవరం పార్వతీ సమేత రాజేశ్వరస్వామి



అంగర చేనేత సహకార సంఘం సమీపంలోని ఆలయంలో అమ్మవారి అలంకరణ



ఆదివారపుపేట ఆశ్రమంలోని అమ్మవారికి విశేష అలంకరణ

- లలితా త్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చిన జగన్మాత
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణంలో సోమేశ్వరంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



ద్రాక్షారామలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారు

రామచంద్రపురం: శరన్నవరాత్ర మహోత్సవాలు రామచంద్రపురం నియోజకవర్గంలో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు ఆదివారం లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని కొత్తూరు జోడు తూముల వద్ద గల కనకదుర్గమ్మ అమ్మవారికి అర్చకుడు చెరుకపల్లి గణేష్ శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శివాలయం వీధిలోని దుర్గమ్మ అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ లైటింగ్ అందరినీ ఆకట్టుకుంది. లైటింగ్‌ను చూసేందుకు పట్టణ వాసులు తరలివచ్చారు.

**అమ్మతత్వం అలవరచుకోవాలి**

రాయవరం: దుర్గామాత తోడుంటే ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొనే ధైర్యం ఉంటుందని, ప్రతి ఒక్కరూ అమ్మతత్వాన్ని ఏర్పరుచుకోవాలని సాహితీవేత్త ఎర్రాప్రగడ రామకృష్ణ భక్తులకు ఉద్బోధించారు. శరన్నవరాత్ర ఉత్సవాల నాల్గో రోజైన ఆదివారం ఆయన వెదురుపాకలోని విజయదుర్గా పీఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రతి ఒక్కరూ మంచి ఆలోచన, మంచి మనస్సు, దైవచింతన కలిగి ఉండాలన్నారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) లాంటి గురువును కలిగి ఉండడం భక్తుల అదృష్టమన్నారు. పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ అమ్మవారిని కొలవడం ద్వారా పాడిపంటలు, ఆయురారోగ్యాలు, శుభాలు కలుగుతాయన్నారు. పలువురు భక్తులు పీఠంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు.

**లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో**

పీఠంలో విజయదుర్గా అమ్మవారు సోమవారం లలితా త్రిపురసుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠబ్రహ్మ కోట శివ, చీమలకొండ వీరావధాని, చక్రవర్తుల మాధవాచార్యులు తదితరుల అర్చకత్వంలో విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి లలితా అష్టోత్తర సహస్ర నామాలతో కుంకుమ పూజలు, నీరాజన మంత్ర పుష్పాలు, ఏకవార రుద్రాభిషేకం, నవగ్రహ హోమం నిర్వహించారు. పీఠంలో భక్తులు కలశాలు ఏర్పాటు చేసుకుని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించుకున్నారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబీ), పీఠం ప్రతినిధులు గాదె భాస్కర నారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి, కనకదుర్గ తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

**మండలంలో..**

మండలంలోని రాయవరం, వెదురుపాక, మాచవరం, సోమేశ్వరం, లొల్ల, పసలపూడి, చెల్లూరు, వెంటూరు తదితర గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మహిళలు సామూహికంగా లలితా సహస్ర నామార్చనలతో కుంకుమ పూజలు చేశారు.ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పలుచోట్ల దుర్గాదేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో మహిళలు మండపాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు.

**అమ్మవారికి విశేష పూజలు**

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లోని శరన్నవరాత్ర శిబిరాల్లో అమ్మవారిని ఆదివారం విశేషంగా అలంకరించారు. అంగర చేనేత సహకార సంఘం సమీపంలోని విజయదుర్గాంబిక అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ఆలయ అర్చకుడు కొలువుల మల్లికార్జునుడి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. తాతపూడి రహదారిలోని కనకదుర్గమ్మ ఆలయం, పల్లపు వీధిలోని రామాలయం ఆవరణంలోని శిబిరం, కపిలేశ్వరపురం దేవీ సెంటర్, నల్లూరులోని విజయ దుర్గాంబిక అమ్మవారి ఆలయం, వెదురుమూడి దుర్గాదేవీ ఆలయంలలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆయా గ్రామాల భక్తులు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

**శిబిరాల వద్ద సందడి**

రామచంద్రపురం రూరల్: మండలవ్యాప్తంగా దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మండలంలోని ద్రాక్షారామ భీమేశ్వరాలయంలోని మాణిక్యాంబా అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు విశేష పూజలు చేశారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారపుపేట ఆశ్రంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు.